సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం । 2 । జూన్ । 2024



నిబంధనలు అతిక్రమిస్తే కేసులే..

ఈ నెల 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కేసులు తప్పవని ఏలూరు రేంజ్ శాంతిభద్రతల పర్యవేక్షణ ప్రత్యేక అధికారి రవిప్రకాష్ హెచ్చరించారు.

8లో



సత్యదేవుని రథానికి రక్షణ

అన్నవరం సత్యదేవుని నూతన టేకు రథానికి అధికారులు రక్షణ ఏర్పాట్లు చేపట్టారు. 'తేరుకు రక్షణ ఈ తీరునా?' శీర్షికన 'సాక్షి' ప్రచురించిన కథనానికి వారు స్పందించారు.

గరిష్ఠం/కనిష్ఠం
40.0°/30.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	40.5	30.0
కాకినాడ	32.8	24.0
అమలాపురం	39.0	29.0

న్యూస్‌రీల్

అప్పనపల్లి క్షేత్రం.. ఆధ్యాత్మిక పరవశం



అప్పనపల్లిలో హోమం చేస్తున్న అర్చకులు

మామిడికుదురు: అప్పన్నపల్లి క్షేత్రం ఆధ్యాత్మిక పరవశంతో ఓలలాడింది.. ఏడు ప్రదక్షిణలతో ఏడేడు జన్మల పాపాలు హరించుకుపోతాయని విశ్వసిస్తున్న భక్తులు శనివారం శ్రీబాల బాలాజీ స్వామిని దర్శించుకుని మురిసిపోయారు. ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేసి తమ కోర్కెలు నెరవేర్చాలని వేడుకున్నారు. వేసవి సెలవులు కావడంతో స్వామివారి దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీబాల బాలాజీ స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని చూసి మురిసిపోయారు. కొత్త ఆలయంతో పాటు పాత గుడిలో కొలువైన బాలాజీ స్వామివారిని దర్శించుకున్నారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,17,050 ఆదాయం లభించింది. నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.53,540 విరాళాలుగా వచ్చాయని ఆలయ కార్యనిర్వహణాధికారి గ్రంధి మాధవి తెలిపారు. ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.2,70,590 ఆదాయం సమకూరిందన్నారు. 3,849 మంది భక్తులు రాగా, 3,061 మంది అన్న ప్రసాదం స్వీకరించారని చెప్పారు.

ఐటీఐ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పదో తేదీ తుది గడువు

రాయవరం: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేసేందుకు ఈ నెల 10 తుది గడువు అని కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్ ఎంవీజీ వర్మ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ వద్ద సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. కోనసీమ జిల్లాలో అడ్మిషన్‌కు రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభ్యర్థులు కాకినాడ ప్రభుత్వ ఐటీఐ, జగ్గంపేట ప్రభుత్వ ఐటీఐ లేక అమలాపురంలోని జిల్లా ఉపాధి కార్యాలయం వద్ద ఈ నెల 10వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపుగా వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. వెరిఫికేషన్ చేయించుకోని అభ్యర్థులను మెరిట్ జాబితాలో పరిగణించరని స్పష్టం చేశారు.

శృంగార వల్లభుని ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఆలయంలో బారులు తీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో శృంగార వల్లభ స్వామి

పెద్దాపురం: తొలి తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు బారులు తీరారు. వేకువజాము నుంచే వచ్చిన భక్తులు స్వామివారికి ముడుపులు, మొక్కులు చెల్లించారు. ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని ఆలయ కార్య నిర్వహణాధికారి వడ్డి శ్రీనివాస్ తెలిపారు. భక్తులకు ప్రసాద వితరణతో పాటు, అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ శ్రీనివాస్ ఆధ్వర్యాన ఏర్పాట్లు చేశారు. వివిధ సేవల టికెట్లు, అన్నదాన విరాళాలు, కేశఖండన ద్వారా స్వామి వారికి రూ.3,09,533 ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు.

సాగుకు శుభారంభం

- డెల్టా కాలువలకు నీటి విడుదల
- జిల్లాలో 1.68 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ పనులు
- నీటి విడుదల రోజునే భారీ వర్షం
- 12.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

సాక్షి, అమలాపురం: ముందస్తు ఖరీఫ్ సాగుకు అన్నీ శుభ శకునాలే.. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు అనుకున్న దానికన్నా ముందే వస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. రుతుపవనాల రాకను స్వాగతిస్తూ మండుటెండల నుంచి ఉపశమనం కలిగిస్తూ జిల్లా వ్యాప్తంగా శనివారం భారీ వర్షం కురిసింది. సాగునీటి పారుదల శాఖ అధికారులు గోదావరి డెల్టా కాలువలకు నీటిని విడుదల చేశారు. వ్యవసాయ శాఖ ఖరీఫ్‌కు అవసరమైన ఎరువులు, విత్తనాలను సిద్ధం చేసింది. ఇవన్నీ ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు శుభపరిణామాలే అని ఆయకట్టు రైతులు అంటున్నారు.

జిల్లాలో ఖరీఫ్ వరి సాగు మొత్తం డెల్టా కాలువపైనే ఆధారపడి ఉంది. తూర్పు, మధ్య డెల్టాలో కలిపి మొత్తం 1,68,780 ఎకరాల్లో సాగు చేయనున్నారు. తూర్పు డెల్టా పరిధిలో రామచంద్రపురం నియోజకవర్గం (కాజులూరు మినహా), మండపేట నియోజకవర్గంతోపాటు ముమ్మిడివరం నియోజకవర్గం పరిధి తాళ్లరేవు, కొత్తపేట నియోజకవర్గ పరిధి ఆలమూరు మండలాల్లో సాగు జరుగుతుండగా, మధ్య డెల్టా పరిధిలో మిగిలిన జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వరి సాగుకు సిద్ధమయ్యారు. గతంలో డెల్టాలో వరి చేలకు జూన్ 10 లేదా 15వ తేదీల్లో సాగునీరు విడుదల చేసేవారు. ఇది శివారు చేలకు చేరే సరికి జూన్ నెల పూర్తయ్యేది. ఇలా ఖరీఫ్ ఆలస్యం కావడంతో అక్టోబర్, నవంబర్ నెలల్లో తుపానుల బారిన పడి పంట నష్టపోతున్నట్లు గుర్తించిన రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందస్తు సాగుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా గత రెండేళ్లుగా జూన్ 1న పంట కాలువలకు సాగునీరు విడుదల చేస్తోంది. ముందస్తు సాగు చేసిన ప్రాంతాల్లో ఖరీఫ్ పంట వర్షాల బారిన పడినా పెద్దగా నష్టం జరగడం లేదు.

01ఎఎంపీ02: ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక ప్రధాన పంట కాలువ నుంచి వస్తున్న నీరు



గోదావరి డెల్టా పరిధిలో దమ్ము చేస్తున్న రైతన్న (ఫైల్)



బొబ్బర్లంకలో పంట కాలువ నుంచి వస్తున్న నీరు

విత్తనాలు.. ఎరువులు

జిల్లాలో ఖరీఫ్ సాగుకు ఎంటీయూ 7,029 రకం విత్తనాలు సుమారు 73 శాతం వినియోగిస్తుండగా, మిగిలిన 27 శాతం ఎంటీయూ 1,318, ఎంటీయూ 1,064 తదితర రకాలను వాడుతున్నారు. మొత్తం 33,750 క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా, ఇప్పటికి సుమారు 23 వేల క్వింటాళ్ల విత్తనాలు రైతుల వద్ద, 7,250 క్వింటాళ్లు ప్రైవేట్ డీలర్ల వద్ద, 900 క్వింటాళ్ల విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. 3,500 క్వింటాళ్ల విత్తనాలకు ఏపీ సీడ్స్‌కు ఇండెంట్ పెట్టారు. ఈ ఖరీఫ్‌కు 43,493 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా, దిగుమతి చేసేందుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ప్రైవేట్ డీలర్ల వద్ద, మార్కెఫెడ్ వద్ద 37,950 మెట్రిక్ టన్నుల ఎరువులు ఉన్నాయి. ఆ మొత్తంలో యూరియా 13,250 మెట్రిక్ టన్నులు, డీఏపీ 2,900 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 2,100 మెట్రిక్ టన్నులు, ప్రతి రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే) పరిధిలో 20 మెట్రిక్ టన్నుల ఎరువులు దిగుమతికి చర్యలు తీసుకోనున్నారు.

నైరుతికి ముందుగానే వర్షం

నైరుతి రుతుపవనాలు మరో మూడు, నాలుగు రోజుల్లో రాష్ట్రంలోకి వస్తాయని వాతావరణ శాఖ చెప్పింది. వాటికి స్వాగతం పలుకుతున్నట్టుగా జిల్లాలో శనివారం ఉదయం పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. జిల్లాలో ఉదయం 8 గంటల వరకూ 12.7 మిల్లీ మీటర్ల వర్షం కురవగా, అత్యధికంగా కె.గంగవరం మండలం 35.2 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా ఆత్రేయపురం 1.6 మిల్లీ మీటర్ల వర్షం పడింది. ఐ.పోలవరం 27.6, ముమ్మిడివరం, ఉప్పలగుప్తం 25.4, కాట్రేనికోన 23.4, అల్లవరం 19.8, కపిలేశ్వరపురం 19.4, రామచంద్రపురం 18.2, అమలాపురం 15.2, అయినవిల్లి 11.4, అంబాజీపేట 10.2, రాజోలు 8.8, సఖినేటిపల్లి 8.6, పి.గన్నవరం 8.4, మామిడికుదురు 7.2, మలికిపురం 4.8, రాయవరం 3.4, కొత్తపేట 3.2, మండపేట 2 మి.మీటర్ల చొప్పున వర్షం కురిసింది. గడిచిన నాలుగు రోజులుగా 40 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదు కావడం, వేడి గాలులతో ఉక్కిరిబిక్కిరి అయిన జనం వర్షంతో సేద తీరారు. మరోవైపు వర్షం ఖరీఫ్ సాగుకు ఊతం ఇవ్వనుంది. వాతావరణం చల్లబడితే రైతులు నారుమడులు వేసుకునేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

ముందస్తు సాగుతో మేలు



ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు సాగుకు అనువుగా డెల్టా కాలువలకు నీరు విడుదల చేసింది. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. సాగు ఆలస్యం కావడంతో అక్టోబర్ 15 నుంచి నవంబర్ నెలాఖరు మధ్య ఏర్పడుతున్న తుపానులు, భారీ వర్షాలతో పంట కోల్పోవడం డెల్టా రైతులకు ఆనవాయితీగా మారింది. ముందస్తు సాగు చేపట్టిన తరువాత జిల్లాలో ఖరీఫ్ నష్టాలు చాలా వరకూ తగ్గాయి.

– జిన్నూరి వెంకటేశ్వరరావు, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా స్థానం సభ్యుడు, నంగవరం, ఉప్పలగుప్తం మండలం

'ఉపాధి' అనుసంధానంతో..

ఉపాధి హామీ పథకంలో పంట కాలువలు, బోదెల్లో పూడికతీత పనులు అధికంగా చేపట్టారు. తూర్పు, మధ్య డెల్టాల పరిధిలో ప్రధాన పంట కాలువలతోపాటు, ఛానళ్లు, పంట బోదెలలో పూడికతీత పనులు చేశారు. పంట కాలువ వెంబడి మట్టి తొలగింపు, జంగిల్ క్లియరెన్స్ చేయడం వంటి పనులు చేస్తున్నారు. ప్రధాన పంట కాలువలకు అనుసంధానంగా ఉన్న డైరెక్టర్ పైప్ (డీపీ)ల వద్ద పూడిక తొలగింపు వల్ల ఆయకట్టు రైతులకు అధికంగా మేలు జరగనుంది. పంట కాలువలపై 828 పనులు చేపట్టగా, పంట బోదెలపై 415 పనులు చేశారు.



ఐ.పోలవరం పంట కాలువలో పూడిక తొలగిస్తున్న ఉపాధి కూలీలు

చట్టాన్ని ఉల్లంఘిస్తే నగర బహిష్కరణే

రౌడీ షీటర్లకు ఎస్పీ శ్రీధర్ హెచ్చరిక



సఖినేటిపల్లి పోలీస్ స్టేషన్ వద్ద రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీస్ అధికారులు

అమలాపురం టౌన్: ఓట్ల లెక్కింపు రోజున హద్దుమీరి చట్టాన్ని ఉల్లంఘించి కవ్వింపు చర్యలకు, హింసాత్మక ఘటనలకు పాల్పడే రౌడీ షీటర్లపై పీడీ యాక్ట్ నమోదు, నగర బహిష్కరణ వంటి చర్యలు ఉంటాయని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ హెచ్చరించారు. జిల్లాలో పలు సమస్యాత్మక గ్రామాల్లో రౌడీ షీటర్లకు పోలీసు అధికారులు శనివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో రౌడీ షీటర్లకు ఎస్పీ శ్రీధర్ హెచ్చరికలను వారు వివరించారు. సఖినేటిపల్లి, అంబాజీపేట, అయినవిల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లకు సీఐలు, ఎస్సైలు కౌన్సెలింగ్‌లు ఇచ్చి పీడీ యాక్ట్, నగర బహిష్కరణ వంటి కేసుల నమోదుపై అవగాహన కల్పించారు. ద్రాక్షారామ మండలం వేగాయమ్మపేట, కపిలేశ్వరపురం మండలం వల్లూరు, అంబాజీపేట మండలం గంగలకుర్రు గ్రామాల్లో పోలీసు అధికారులు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలతో మాట్లాడారు. ఓట్ల లెక్కింపు రోజున పోలీస్ బందోబస్తు ఎలా ఉంటుందో వివరించారు. అల్లవరం మండలం నక్కా రామేశ్వరంలో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి, అతని నుంచి రూ.5,550 విలువైన 37 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఓట్ల లెక్కింపు రోజున అల్లరి మూకలు, సంఘ విద్రోహ శక్తులు వివాదాస్పదంగా ప్రవర్తిస్తే పోలీసు చర్యలు ఎంతటి తీవ్రంగా ఉంటాయో మాక్ డ్రిల్‌ల ద్వారా ప్రత్యేకంగా చూపించారు. ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ పరిధిలో మాక్‌డ్రిల్ నిర్వహించారు.

ధరణీనాయక గోవిందా..

- కిక్కిరిసిన వాడపల్లి ఆలయం
- ఒక్కరోజే రూ.33.28 లక్షల ఆదాయం





ఆలయం వద్ద ప్రదక్షిణ చేస్తున్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామివారు

ఆత్రేయపురం: దినకర తేజా గోవిందా.. ధరణీనాయక గోవిందా.. నామస్మరణ కోనసీమ తిరుపతి వాడపల్లి క్షేత్రంలో మార్మోగింది.. అశేష భక్తజనం ఆ స్వామిని కొలుస్తూ తన్మయత్వం చెందింది.. వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఉదయం స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అర్చకులు అలంకరించారు. అనంతనం దర్శన భాగ్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గౌతమీ గోదావరి నదిలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని, మొక్కులు సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో వేంచేసి ఉన్న క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. ఏడు వారాల నోము ఆచరిస్తున్న భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. దేవదాయ ధర్మదాయ శాఖ ఉప కమిషనర్ ఎం.విజయరాజు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ ఏర్పాట్లను డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. ఈఓ భూపతిరాజు మాట్లాడుతూ స్వామివారి ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ ప్రసాదం విక్రయం, ఆన్‌లైన్ సేవల ద్వారా సుమారు రూ.33,28,574 ఆదాయం సమకూరిందన్నారు. ఆలయం వద్ద ఏర్పాటైన అన్నసమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయం వద్ద ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

పొలాల వైపు గోదారమ్మ పరుగులు

సెంట్రల్ డెల్టా కాలువకు నీటి విడుదల

ఆత్రేయపురం: కాలువలకు జలకళ వచ్చింది.. పచ్చని పంట సిరులు కురిపించేందుకు గోదారమ్మ పరుగులు తీసింది.. ముందుగా ప్రకటించిన విధంగానే సాగుకు సెంట్రల్ డెల్టా కాలువల ద్వారా అధికారులు నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి పి.గన్నవరం ఇరిగేషన్ సబ్ డివిజన్ డీఈ కె.వెంకటేశ్వరరావు ముహూర్తం ప్రకారం శనివారం ఉదయం స్విచ్ ఆన్ చేశారు. గేట్లను ఎత్తి 500 క్యూసెక్కుల నీటిని కాలువలకు విడుదల చేశారు. తొలుత బొబ్బర్లంక వద్ద హెడ్ స్లూయిజ్‌ను మామిడి తోరణాలు, అరటి చెట్లతో ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా డీఈ వెంకటేశ్వరరావు, ఏఈ పిల్లా సత్యనారాయణతో పాటు సిబ్బంది గోదావరి మాతకు ప్రత్యేక పూజలు చేసి నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమ, పండ్లు సమర్పించి హారతి ఇచ్చారు. స్విచ్ ఆన్ చేయగానే ప్రధాన కాలువల నుంచి గోదావరి నీరు పరుగులు తీసింది. ప్రస్తుతం 500 క్యూసెక్కుల నీటిని కాటన్ బ్యారేజీ నుంచి కాలువలకు విడుదల చేస్తున్నారు. క్రమేపీ నీటి విడుదలను పెంచుతామని వారు ప్రకటించారు. రైతులంతా నీటిని పొదుపుగా వాడుకోవాలని, వ్యవసాయ అధికారులు సూచించిన విధంగా పంటలకు నీటిని వాడితే దిగుబడులు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్, హెడ్‌వర్క్స్ సిబ్బంది ఎస్.పద్దరాజు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



బొబ్బర్లంకలో గోదావరి మాతకు పూజలు చేస్తున్న డీఈ వెంకటేశ్వరరావు

కౌంటింగ్‌కు సర్వ సన్నద్ధం

- పెద్ద ఎత్తున సిబ్బంది నియామకం
- డీఎస్పీ ఆధ్వర్యంలో సివిల్ ఫోర్స్‌తో భద్రత

సాక్షి, అమలాపురం: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా చేపట్టిన జిల్లా యంత్రాంగం.. కౌంటింగ్‌ను సైతం పక్కాగా నిర్వహించాలనే పట్టుదలతో ఉంది. ఇందుకు తగినట్టుగా కౌంటింగ్ ప్రక్రియలో ఉన్నతాధికారులు, అధికారులు, సాధారణ సిబ్బంది, భద్రతా బలగాలు, సాధారణ పోలీసులను పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. అమలాపురం పార్లమెంట్‌తో పాటు జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలకు కౌంటింగ్ ఈ నెల 4న కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కాలేజీలో జరగనుంది. సాధారణ ఉద్యోగి నుంచి ఐఏఎస్ వరకూ ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. పార్లమెంట్ స్థానానికి కౌంటింగ్ అసెంబ్లీల వారీగా నిర్వహించనున్నారు. అలాగే అసెంబ్లీల వారీగా విడిగా కౌంటింగ్ జరగనుంది. ప్రతి కౌంటింగ్ కేంద్రానికి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, సూపర్ వైజర్లు, అసిస్టెంట్‌లు, మైక్రో అబ్జర్వర్లు, నాల్గవ తరగతి ఉద్యోగులను నియమించారు. అలాగే హాల్ ఇన్‌చార్జిగా గ్రూప్ సర్వీసు అధికారులను, ఒకటి, రెండు అసెంబ్లీలకు అబ్జర్వర్లుగా సివిల్ సర్వీస్ అధికారులను ఏర్పాటు చేశారు.

51 మంది ఏఆర్వోలు

కౌంటింగ్‌కు సంబంధించి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా 51 మందిని నియమించారు. పార్లమెంట్‌కు అసెంబ్లీల వారీగా, అసెంబ్లీలకు, సర్వీసు ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్‌ల కౌంటింగ్‌కు వీరిని ఎంపిక చేశారు. కౌంటింగ్ అసిస్టెంట్‌లు 299 మందిని, మైక్రో అబ్జర్వర్లు 286 మంది, క్లాస్–4 సిబ్బంది 295 మందిని నియమించారు. పోలింగ్ రోజున జిల్లాలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఒక కంపెనీ సీఏపీఎఫ్.. నాలుగు సెక్షన్ల స్టేట్ ఆర్మ్‌డ్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. ఒక డీఎస్పీ ఆధ్వర్యంలో ఒక సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, 12 మంది పోలీసులతో భద్రత కల్పిస్తున్నారు. మొత్తం కౌంటింగ్ ప్రక్రియను 40 సీసీ కెమేరాలతో పర్యవేక్షించనున్నారు.



చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కాలేజీలో కౌంటింగ్ కేంద్రం

కళాశాల గంట మోగింది..

- ఇంటర్ తరగతులు ప్రారంభం
- తొలిరోజు హాజరు అంతంత మాత్రం

రాయవరం: జిల్లాలో ఇంటర్మీడియెట్ కళాశాలలు శనివారం పునః ప్రారంభమయ్యాయి. వేసవి సెలవుల అనంతరం కళాశాలల్లో గణగణమంటూ గంట మోగింది. పదో తరగతి అనంతరం ఇంటర్‌లో చేరిన విద్యార్థులు భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో తరగతులకు హాజరయ్యారు. అయితే హాజరు అంతంత మాత్రంగానే ఉంది. జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఇప్పటికే అధికారుల ఆదేశానుసారం అడ్మిషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. కళాశాలలకు సమీప ప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లో ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు అడ్మిషన్ డ్రైవ్ చేపట్టారు. ప్రభుత్వ కళాశాలల్లో నాడు–నేడు కార్యక్రమం కింద అందుబాటులోకి వచ్చిన వసతులు, సౌకర్యాలు, ల్యాబ్‌లు, డిజిటల్ విద్య, ఐఎఫ్‌పీ ప్యానెల్స్ ద్వారా బోధన, నిష్ణాతులైన అధ్యాపకులు, బోధన విధానాలు, ఇంటర్ విద్యతో లభిస్తున్న భవిష్యత్ అవకాశాలను వివరిస్తున్నారు.

జిల్లాలో కళాశాలలు ఇలా..

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 136 కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 13, ఎయిడెడ్ జూనియర్ కళాశాల 1, సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో ఆరు, ఒకేషనల్ జూనియర్ కళాశాలలు 18, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు 67, హైస్కూల్ ప్లస్‌లు 31 ఉన్నాయి. గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 18,272 మంది ఉత్తీర్ణత సాధించగా, వీరిలో అధిక సంఖ్యలో విద్యార్థులు ఇంటర్‌లో చేరనున్నారు. గత విద్యా సంవత్సరంలో ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు 13,940 మంది ఈ ఏడాది సెకండియర్ విద్యను అభ్యసిస్తారు. ఈ ఏడాది ఫస్టియర్‌లో చేరికలు అధికంగా ఉండే అవకాశముందని అధ్యాపకులు భావిస్తున్నారు.



వార్షిక క్యాలెండర్ పాటించాలి



ఇంటర్ తరగతులు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలి రోజు మాత్రం హాజరు తక్కువగా ఉన్నట్లు క్షేత్ర స్థాయి నుంచి నివేదికలు అందాయి. ఈ నెల 5వ తేదీ నుంచి తరగతులకు విద్యార్థుల హాజరు పెరుగుతుంది. ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యం పరిధిలోని కళాశాలలన్నీ వార్షిక క్యాలెండర్‌ను తప్పనిసరిగా పాటించాలి.

– వనుము సోమశేఖరరావు, ఇంటర్ బోర్డు జిల్లా విద్యా శాఖాధికారి, అమలాపురం

నేడు హనుమాన్ చాలీసా పారాయణ

- అమలాపురంలో వెయ్యి మందితో మహాయజ్ఞం
- శ్రీదత్త పీఠాధిపతి నాగానంద సరస్వతి రాక



హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం ఏర్పాట్లపై చర్చిస్తున్న విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రతినిధులు

అమలాపురం టౌన్: విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో అమలాపురంలోని డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు కాపు కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం సహస్ర గళ హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం నిర్వహించేందుకు ఆ పరిషత్ ఏర్పాట్లు పూర్తి చేసింది. వెయ్యి మంది భక్తులతో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ చేయనున్నారు. ఈ ఆధ్యాత్మిక క్రతువుకు ముఖ్య అతిథులుగా పశ్చిమ గోదావరి జిల్లా శృంగవృక్షం శ్రీదత్త పీఠం 5వ పీఠాధిపతి, వీహెచ్‌పీ కేంద్రీయ మార్గదర్శి శ్రీసాయిదత్త నాగానంద సరస్వతి స్వామీజీ, ఉత్తర కాశీ, హిమాలయాలకు చెందిన శ్రీస్వామి సూర్య భాస్కరేంద్ర సరస్వతి, అంబాజీపేట మండలం వక్కలంకకు చెందిన వాసుదేవానంద స్వామీజీ హాజరు కానున్నారు. పారాయణ మహా యజ్ఞానికి విశ్వహిందూ పరిషత్ ఉత్తరాంధ్ర ప్రాంత కార్యదర్శి తనికెళ్ల సత్య రవికుమార్ ముఖ్య వక్తగా వ్యవహరించనున్నారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి ప్రయాగ నరసింహమూర్తి ఆధ్వర్యంలో జరిగే ఈ క్రతువులో తొలుత ఆధ్మాత్మికవేత్త రేలంగి కుమార్‌శంకర్ గౌడ్ నిర్వహించే పూజా కార్యక్రమంతో పారామణ మహా యజ్ఞానికి శ్రీకారం చుడతారు. కుల, మత, వర్గ, లింగ, వయోభేదం లేకుండా భక్తులంతా క్రమశిక్షణతో పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. సామూహిక సహస్ర హనుమాన్ చాలీసా పారాయణలో పాల్గొనే ప్రతి భక్తుని చేతిలో చాలీసా ప్రతులు ఉంచుతారు. పారాయణ పూర్తయ్యాక భక్తులు తీర్థ, అన్న ప్రసాదాలు స్వీకరించేలా పరిషత్ ఏర్పాట్లు చేసింది. ఆదివారం ఉదయ 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఈ సామూహిక పారాయణ జరుగుతుంది. ఈ యజ్ఞం నిర్వహణపై వీహెచ్‌పీ జిల్లా శాఖ స్థానిక కాపు కల్యాణ మండపంలో శనివారం సన్నాహక సమావేశం నిర్వహించింది. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, నరసింహమూర్తి, ఆధ్యాత్మిక వేత్త కుమార్‌శంకర్ గౌడ్, గొవ్వాల నాగరాజు తదితరులు మహా యజ్ఞం సమయంలో భక్తులకు కల్పించే సౌకర్యాలపై చర్చించారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం


వెంకటరెడ్డి (ఫైల్)

అనపర్తి: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు సామర్లకోట జీఆర్పీ ఎస్సై లోవరాజు తెలిపారు. అనపర్తికి చెందిన గొలుగూరి వెంకట రెడ్డి (58) స్థానికంగా ప్రింటింగ్ ప్రెస్ నిర్వహిస్తున్నాడు. శనివారం సొంత పనిపై రైల్వే గేటు అవతలి వైపునకు వెళ్లి వెంకట రెడ్డి తిరిగి వస్తూ రైలు పట్టాలు దాటుతుండగా ఖరగ్‌పూర్ వెళ్లే స్పెషల్ రైలు ఢీకొంది. దీంతో అతను మృతి చెందాడు.

ఐసెట్‌లో ఆదిత్య డిగ్రీ విద్యార్థుల హవా


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ సుగుణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఏపీ ఐసెట్‌- 2024 ఫలితాల్లో ఆదిత్య డిగ్రీ కళాశాలల విద్యార్థులు బి.కార్తీక్ రాష్ట్ర స్థాయి 2వ ర్యాంకు, ఎస్.దశరథ రామరెడ్డి 6వ ర్యాంకు, అనుపమ 8వ ర్యాంకు సాధించారని ఆ విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్.సుగుణ తెలిపారు. రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఆదిత్య డిగ్రీ కళాశాలలో విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. తమ విద్యార్థులు 10 లోపు మూడు, 100 లోపు 22, వెయ్యి లోపు 95 ర్యాంకులు సాధించారన్నారు. ఎల్.యశ్వంత్ సాయిరామ్ కుమార్ 19, కె.నాగదుర్గా ప్రసాద్‌కు 27, ఎ.తరుణ్ ఆదిత్య శ్రీవర్ధన్‌కు 28, బి.శ్రీకాంత్‌కు 33, కేడీఎస్ నిఖితకు 39, సీహెచ్ దేవి శైలజకు 43, కె.శ్రీసాయి వినయ్‌కు 58, ఎస్.నితిన్‌సాగర్‌కు 62, పీవీఎల్ దివ్యకు 63, ఎ.ఐజాక్ బాబుకు 64, కె.లక్ష్మీప్రసన్నకు 69, ఎ.మానసప్రియకు 71, వి.ధరణికి 73, బి.నయనకు 74 ర్యాంకు వచ్చిందని వివరించారు. ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి మాట్లాడుతూ ర్యాంకులతో పాటు క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా 52 ఎంఎన్‌సీల్లో తమ విద్యార్థులు 140 పైగా ఉద్యోగాలు సాధించారన్నారు. సమావేశంలో ఆదిత్య కళాశాలల ప్రిన్సిపాల్స్ సీహెచ్ ఫణికుమార్, ఎస్ఎస్ రెహమాన్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

400 లొకేషన్లలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

- సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ శేషాచలం


మాట్లాడుతున్న బీఎస్ఎన్ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ శేషాచలం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): అర్బన్ ప్రాంతాల్లో ఫేజ్ 9.2లో భాగంగా 400 లొకేషన్లలో 4జీ సేవలు అందుబాటులోకి రానున్నాయని బీఎస్ఎన్ఎల్ ఏపీ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.శేషాచలం వెల్లడించారు. దేశవ్యాప్తంగా 20 వేల టవర్లు వేసే క్రమంలో ఏపీ సర్కిల్‌లోని మారుమూల ప్రాంతాల్లో 1,350 టవర్లు వేయనున్నామని అన్నారు. అంత్యోదయ మిషన్‌లో వెయ్యి టవర్లు వేశామని ఆయన తెలిపారు. రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్‌లోని నన్నయ సంచార్ భవన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 17 వేల గ్రామాలకు గాను అసలు నెట్‌వర్క్ లేని 3,800 గ్రామాల్లో సేవలు అందించడానికి ప్రణాళిక చేశామన్నారు. బీఎస్ఎన్ఎల్ 4జీ సేవల్లో భాగంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ప్రధాన మంత్రి అంత్యోదయ పథకంలో 400 టవర్లు ఏజెన్సీ ప్రాంతాల్లో మరికొద్ది రోజుల్లో అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. అన్నీ కాపర్ ఆధారిత సర్వీసులను ఫైబర్ టెక్నాలజీలోకి మార్చడానికి టెలికాం ఇన్ఫ్రా ప్రొవైడర్స్‌ను ఎన్‌రోల్ చేసుకుని, వారి ద్వారా అతి త్వరలో మార్చనున్నట్లు ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్ సర్కిల్ ఆదాయం 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.850 కోట్లు వచ్చిందని ఆయన చెబుతూ, ఇది గత ఆర్థిక సంవత్సరం కంటే రూ.150 కోట్లు అధికమని చెప్పారు. 4జీ టెక్నాలజీతో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు మరిన్ని సేవలు అందించడానికి కసరత్తు చేస్తుందన్నారు. జనరల్ మేనేజర్ (మొబైల్) ఎ.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పి.రాజు, డీజీఎంలు రాజశేఖర్ బాబు, నాగరాజు, సత్యనారాయణ, ఏజీఎంలు బమ్మిడి శ్రీనివాస్, శారదాదేవి, బీఎస్ఎన్ఎల్ పీఆర్ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మున్సిపల్ ఆర్డీగా నాగ నరసింహారావు



రాజమహేంద్రవరం సిటీ: పుర పరిపాలనా శాఖ ప్రాంతీయ సంచాలకుడి (మున్సిపల్ ఆర్డీ)గా కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ నాగ నరసింహారావు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాజమహేంద్రవరం మున్సిపల్ రీజినల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఆర్డీ ఎస్‌వీవీ సత్యనారాయణ ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో నాగ నరసింహారావును పూర్తి అదనపు బాధ్యతలతో ఆర్డీగా నియమించారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందుకున్న ఆయన శనివారం రాజమహేంద్రవరంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నాగ నరసింహారావు మాట్లాడుతూ పురపాలక సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన్ని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కమిషనర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బాలస్వామి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఏసుబాబు, ఆర్డీ కార్యాలయ అధికారులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులే..

- ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్ట చర్యలు
- విజయోత్సవాలు, ర్యాలీలకు అనుమతుల్లేవు
- ఏలూరు రేంజ్ శాంతి భద్రతల పర్యవేక్షణ ప్రత్యేక అధికారి రవిప్రకాష్


అమలాపురంలో విలేకర్లతో మాట్లాడుతున్న ఐజీ రవిప్రకాష్, చిత్రంలో జిల్లా ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్: ఏలూరు రేంజ్ పరిధిలోని జిల్లాల్లో ఈ నెల 4న జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగేలా పోలీసులకు ప్రజలు సహకరించాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ఐజీ, ఏలూరు రేంజ్ శాంతి భద్రతల పర్యవేక్షణ ప్రత్యేక అధికారి ఎం.రవిప్రకాష్ విజ్ఞప్తి చేశారు. శనివారం సాయంత్రం అమలాపురంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్‌తో కలిసి రవిప్రకాష్ మాట్లాడారు. రేంజ్ పరిధిలో ఒక్క కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలో మినహా మిగిలిన చోట్ల పోలింగ్ ప్రశాంతంగా జరిగిందన్నారు. ఓట్ల లెక్కింపు కూడా అంతే ప్రశాంతంగా జరిగేందుకు ఆయా జిల్లాల పోలీస్ శాఖలు సకల బందోబస్తు ఏర్పాట్లు చేశాయని ఐజీ వెల్లడించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా నిబంధనలు అతిక్రమిస్తే పోలీసు కేసులు తప్పవని, తద్వారా భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని హితవు పలికారు. ఓట్ల లెక్కింపు రోజున ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, ప్రదర్శనలకు అనుమతుల్లేవని స్పష్టం చేశారు.

క్యూఆర్ టీమ్‌ల ఏర్పాటు

రేంజ్‌లోని కృష్ణా, పశ్చిమ, తూర్పు గోదావరి ఉమ్మడి జిల్లాల పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లో హింసాత్మక సంఘటలను తక్షణమే అదుపు చేసేందుకు కొత్తగా క్విక్ రియాక్షన్ (క్యూఆర్) టీమ్‌లను ఏర్పాటు చేశామని రవిప్రకాష్ తెలిపారు. ఏ గ్రామంలోనైనా ఘర్షణ లేదా వివాదం జరిగిన వెంటనే అదుపు చేసేందుకు క్యూఆర్ టీమ్‌లు సంసిద్ధమై ఉంటాయని చెప్పారు. సంఘటన జరిగిన ఐదు నుంచి పది నిమిషాల్లో సంఘటనా స్థలంలో ఉండేలా క్యూఆర్ టీమ్‌లు పనిచేస్తాయని స్పష్టం చేశారు. కాకినాడ జిల్లాలో పిఠాపురం, పశ్చిమ గోదావరి జిల్లాలో దెందులూరు, కృష్ణా జిల్లాలో నూజివీడు, గన్నవరం, పెనమలూరు తదితర నియోజకవర్గాల్లో పోలీసు బందోబస్తుపరంగా ప్రత్యేక దృష్టి పెట్టామని వివరించారు.

ప్రతి జిల్లా ఇన్‌చార్జిగా ఎస్పీ

ప్రతి జిల్లా ఓట్ల లెక్కింపు కేంద్రానికి ఆ జిల్లా ఎస్పీ ఇన్‌చార్జిగా ఉండి బందోబస్తును పర్యవేక్షిస్తారని రవిప్రకాష్ అన్నారు. పోలీసు బలగాల కంపెనీలు, పార్టీలు, టీమ్‌లకు ఓ సీఐ, ఎస్సైలు ఇన్‌చార్జులుగా ఉండి వాటిని నిర్వహిస్తారని చెప్పారు. జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచే ఐజీ రవిప్రకాష్ రేంజ్ పరిధిలోని అన్ని జిల్లాల ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఐజీ రవిప్రకాష్ జిల్లా ఎస్పీ శ్రీధర్, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, స్పెషల్ బ్రాంచి సీఐలతో జిల్లాలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.

ప్రతి జిల్లాలో ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద కేంద్ర బలగాలు, జిల్లా ఆర్మ్‌డ్ బలగాలు, జిల్లా పోలీసు యంత్రాంగంతో మూడంచెల బందోబస్తును పకడ్బందీగా ఏర్పాటు చేశామన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి వచ్చే ఏజెంట్లు, రాజకీయ పార్టీల అభ్యర్థులను నఖశిఖ పర్యంతం తనిఖీలు చేసిన తర్వాతే తగిన ధ్రువీకరణ పత్రాలతో లోనికి అనుమతిస్తామన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద రెడ్ జోన్లు, నో ఫ్లయింగ్ జోన్లు, నో మెన్, నో వెహికల్ జోన్లు ఏర్పాటు చేశామన్నారు. ఇవి కాకుండా ఓట్ల లెక్కింపు సమయాల్లో, అభ్యర్థుల గెలుపు, ఓటముల దృష్ట్యా అనివార్యమయ్యే ఘర్షణలు, విబేధాలపై పోలీసు నిఘా విస్తృతంగా ఉంటుందని వివరించారు.

అందరిచూపు టి-20 వరల్డ్ కప్ పైనే..


డాక్టర్ శివ కుమార్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): క్రికెట్ క్రీడాకారులను భారత్‌లో దేవుళ్లతో సమానంగా చూస్తారు. 130 కోట్ల మంది భారతీయుల ఆశల తగ్గట్టుగా భారత్ జట్టు ఈ నెల 2వ తేదీ ఆదివారం నుంచి అమెరికాలో టి-20 వరల్డ్ కప్ ఆడనుంది. యువ క్రికెటర్లతో మంచి ఫామ్‌లో ఉన్న మన జట్టు టి-20 వరల్డ్ కప్‌ను గెలుచుకుని అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతుందా లేదా అనే దానిపై ప్రతి ఒక్కరిలో ఉత్కంఠ నెలకొంది. యూఎస్‌లో ఆదివారం నుంచి ప్రారంభం కానున్న టి-20 వరల్డ్ కప్‌లో భారత జట్టు విజయ సాధ్యాసాధ్యాలపై 'సాక్షి'తో జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్షుడు డాక్టర్ శివకుమార్ మాట్లాడారు. టి-20 వరల్డ్ కప్‌లో జట్టు సగటు స్కోర్ 170-180 నమోదు చేస్తుందని భావిస్తున్నట్లు తెలిపారు. సెమీ ఫైనల్స్‌కు ఇండియా, వెస్టిండీస్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా చేరుకోవచ్చని శివ కుమార్ అన్నారు. ఈ వరల్డ్ కప్‌లో మ్యాచ్ ఆఫ్ ది సిరీస్‌గా విరాట్ కోహ్లి, మిచెల్ స్టార్క్, రోహిత్ శర్మ నిలుస్తారని అనుకుంటానన్నారు. ఈ కప్‌ను కైవశం చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఇండియా, వెస్టిండీస్, ఆస్ట్రేలియాలకు ఉందన్నారు.

పంట కాలువలో వృద్ధుడి మృతదేహం


వృద్ధుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

కరప: నడకుదురు సమీపంలోని పంట కాలువలో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. కరప ఎస్ఐ టి.రామకృష్ణ కథనం ప్రకారం.. కరప మండలం నడకుదురు శివారున పంట కాలువలో ఓ వృద్ధుడి మృతదేహం ఉన్నట్టు సమాచారం అందడంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. అతని వయసు సుమారు 60 నుంచి 70 ఏళ్ల మధ్యలో ఉంటుందని, చేపలు వేటాడుతూ ప్రమాదవశాత్తూ కాలుజారి కాలువలో పడి మృతిచెంది ఉండొచ్చని భావిస్తున్నారు. సదరు వ్యక్తి వివరాలు ఎవరికైనా తెలిస్తే కరప పోలీస్ స్టేషన్ నంబర్ 0884 2394833, ఎస్ఐ నంబర్ 94407 96557లకు సమాచారం అందించాలని ఎస్ఐ రామకృష్ణ కోరారు. మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు.

సత్యదేవుని రథానికి రక్షణ


తేరుకు రక్షణ ఈ తీరునా?

సాక్షి దినపత్రికలో గురువారం వచ్చిన కథనం


ఎండ, వానల నుంచి రక్షణకు టేకు రథంపై కప్పిన టార్పాలిన్


రథం సమీపంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

టార్పాలిన్, సీసీ కెమెరాల ఏర్పాటు

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను ఊరేగించేందుకు రూ.1.08 కోట్లతో తయారు చేయించిన 36 అడుగుల టేకు రథానికి అధికారులు రక్షణ ఏర్పాట్లు చేపట్టారు. శనివారం ఆ రథానికి టార్పాలిన్ కప్పడంతో పాటు ఆ రథం వద్దకు ఎవరూ వెళ్లకుండా చుట్టూ ఫెన్సింగ్ వేశారు. అదే విధంగా రథం చుట్టూ సీసీ టీవీ కెమెరాలు అమర్చారు. సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా గత నెల 22న ఈ రథంపై గ్రామంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని ఘనంగా ఊరేగించారు. అనంతరం ఆ రథాన్ని పంపా సత్రంలో ఉంచి ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. అది ఎండకు ఎండి, వానకు తడుస్తుండడంతో గురువారం 'సాక్షి' దినపత్రికలో 'తేరుకు రక్షణ ఈ తీరునా' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఈఓ కె.రామచంద్రమోహన్ రథంపై వెంటనే రక్షణ ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో టార్పాలిన్‌తోపాటు రథం చుట్టూ ఫెన్సింగ్, అక్కడ సీసీ టీవీ కెమేరాలు అమర్చారు. కాగా, త్వరలో జరిగే దేవస్థానం ట్రస్ట్ బోర్డు సమావేశంలో రథానికి శాశ్వతంగా షెడ్డు నిర్మించేందుకు స్థలం ఖరారు చేసి, పనులకు టెండర్లు పిలుస్తామని డీఈ ఉదయ్ తెలిపారు.

విరుచుకుపడిన ఈదురు గాలులు


మొగళ్లమూరులో విద్యుత్ తీగలపై పడిన కొబ్బరి చెట్టు


కాట్రేనికోన మండలం గిడ్డివారిపేటలో ఓ ఇంటిపై పడిన చెట్టు

అల్లవరం: ఈదురు గాలులు విరుచుకుపడ్డాయి.. గ్రామాల్లో పలు ప్రాంతాలను అధ్వానంగా మార్చాయి.. శనివారం అల్లవరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, ఐ.పోలవరం, ముమ్మిడివరం మండలాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. ఉదయమే భారీ గాలులు వీచాయి. మెరుపులు, పిడుగుల శబ్దం హడలెత్తించింది. సుమారు గంట పాటు వీచిన గాలులకు పలు గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. బలమైన గాలులకు కొబ్బరి చెట్లు విద్యుత్ తీగలపై, పూరిళ్లపై పడ్డాయి. అల్లవరం మండలంలో 12 విద్యుత్ స్తంభాలు పడిపోయాయని ఏపీఈపీడీసీఎల్ ఏఈ బి.వెంకటేశ్వరరావు తెలిపారు. వాటి స్థానంలో కొత్తవి వేసి విద్యుత్తు పునరుద్ధరిస్తున్నామన్నారు. దేవగుప్తంలో పిడుగులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. కొమరగిరిపట్నం, బెండమూర్లంక గ్రామాల్లో బలమైన గాలులకు రెండు ఇళ్లు పడిపోయాయి. రెవెన్యూ అధికారులు ఘటనా స్థలాలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందించారు.

దారి కాచి.. దోపిడీ చేసి..

- వ్యసనాలకు బానిసై చోరీలు
- చివరికి పోలీసులకు చిక్కిన నిందితులు


నిందితులను చూపుతూ వివరాలను వెల్లడిస్తున్న సీఐ దొరరాజు, ఎస్సై సురేష్‌బాబు

రామచంద్రపురం: దారి కాచి కత్తులతో బెదిరిస్తూ దోపిడీలకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు రామచంద్రపురం సీఐ పి.దొరరాజు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై కె.సురేష్‌బాబుతో కలసి ఆయన శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆ వివరాల ప్రకారం.. కొత్తూరుకు చెందిన గంధ్రోతు వీరకిశోర్ గత నెల 30 రాత్రి 10.30 గంటల సమయంలో తన బైక్‌పై ఇంటికి వెళుతుండగా నలుగురు అతన్ని నిలువరించారు. కత్తులతో బెదిరించి బలవంతంగా అతని నుంచి రూ.2 వేలు, బంగారు ఉంగరాన్ని లాక్కొని పరారయ్యారు. ఈ మేరకు వీరకిశోర్ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కేసును త్వరితగతిన ఛేదించేందుకు జిల్లా ఎస్పీ శ్రీధర్, అడిషనల్ ఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆదేశాల మేరకు డీఎస్పీ బి.రామకృష్ణ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సీఐ దొరరాజు తెలిపారు. నిందితుల్లో పట్టణ రాజబాబునగర్‌కు చెందిన గంపల విజయశేఖర్ (పండు)పై 7 క్రిమినల్ కేసులతో పాటు రౌడీషీట్ కూడా ఉందన్నారు. అతనితో పాటు ముగ్గురు బృందంగా ఏర్పడి సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆశతో దారిన పోయే వారిని చాకులు, మారణాయుధాలు చూపించి బెదిరిస్తూ నగదు, విలువైన వస్తువులను లాగేసుకుని దారి దోపిడీలకు పాల్పడుతున్నారని సీఐ తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 30 స్థానిక బార్‌లో మద్యం తాగి చోడవరం బైపాస్‌లో కొత్తూరు జంక్షన్‌కు దగ్గరలో చీకట్లో ఆగి పలువురిని బెదిరించి నగదుతో పాటు బంగారు ఆభరణాలను కూడా దోచుకున్నారన్నారు. అప్పుడే వీర కిశోర్ నుంచి కూడా నగదు, బంగారు ఉంగరాన్ని లాక్కున్నట్లు చెప్పారు. కాగా ఒక కారును కూడా ఆపి కత్తులతో బెదిరించి నగదును లాక్కోగా, ఇంకా ఏమైనా విలువైన వస్తువులు ఉన్నాయని బెదిరించగా అతను భయంతో కారును స్పీడ్‌గా పోనివ్వగా మోటార్ సైకిళ్లపై నిందితులు వెంబడించారని వివరించారు. తిరిగి దోపిడీలు చేసేందుకు వైఎస్సార్ నగర్‌లోని రైల్వే స్టేషన్ వద్ద కూర్చుని ప్రణాళికలు వేస్తుండగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. గంపల విజయ్‌శేఖర్ (పండు)తో పాటు రాజబాబునగర్‌కు చెందిన తుమ్మలపల్లి లేమేకు అంబ్రోస్ అలియాస్ నాని, తాతపూడి చిన్నిలను అరెస్ట్ చేయగా మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. వీరి నుంచి నగదుతో పాటు నేరాలకు ఉపయోగించిన చాకులు, బైక్‌ను సీజ్ చేశామని, నిందితులను కోర్టుకు తరలించామన్నారు. కేసును ఛేదించిన డీఎస్పీ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో సీఐ పి.దొరరాజు, ఎస్సై కె.సురేష్‌బాబు, వారి సిబ్బందిని ఎస్పీ శ్రీధర్ అభినందించారు.